11079601

నేటి భౌతిక జీవితము చాలా అయోమయ స్థితిలో ఉంది. దేవుడన్న పదమునకు అర్థములనేకముగా కనుపిస్తున్నాయి. దినము కానిదే దైవమని ఒక అర్థము. దైవమునకు సరైన అర్థము వెలుగు. ఆ వెలుగు ప్రతి మానవుని యందు ఉంటున్నది. వెలుగు, కాంతి, ప్రకాశము ఈ విధముగా దీపమునకు సంబంధించిన రూపములతో పోల్చుకుంటూ వచ్చారు. వెలుగే చీకటిగా మారుతున్నది. చీకటియే వెలుగుగా మారుతున్నది. చీకటి వెలుగులు రెండు ఒకే కాలములో, ఒకే స్థానములో కనిపించవు. వీటినే జ్ఞానాజ్ఞానములని పిలుస్తూ వచ్చారు. చీకటి యొక్క అభావమే వెలుగు. వెలుగు యొక్క అభావమే చీకటి. అభావము అనగా భావము కానిది. భావమునకు అర్థములుంటున్నాయి. భావము చేత భగవంతుని ప్రార్థించుట ఒకటి. గుణముల చేత ప్రార్థించటము. లీలల చేత యింకో విధముగా భావించటము ఒకటి. నామము చేత భావించటము ఒకటి. భగవత్ప్రార్థనలందు లీలాప్రార్థన, గుణప్రార్థన, భావప్రార్థన, సంకీర్తన ప్రార్థన ఈ నాలుగు మార్గములందు ప్రవేశించి దాని యదార్థ స్వరూపాన్ని గుర్తిస్తూ వచ్చారు.

భావము, రూపము, నామము, కీర్తన అన్నింటికి హృదయమే మూలస్థానము. కనుకనే

దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడనగ తనదు దేహమందె
పాపమన వేరు పరదేశమునే లేదు
తాను చేయు పనుల తగిలియుండు

దేవుడుగాని, పాపముగాని పరదేశములందు లేదు. తన దేహమునందే ఉన్నది. అన్నింటికి దేహమే మూల కారణము. దేహమునందు ఉండిన వాడు కనుక ఇతనికి దేహి అని పేరు వచ్చింది. శరీరము నందు నివశించుటచేత శరీరి అని పేరు వచ్చింది. దేహమనే క్షేత్రమందు నివాసము చేయుటం చేత క్షేత్రజ్ఞుడని కూడా పేరు వచ్చింది. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ స్సనాతనః' దేహమే ఒక దేవాలయము. జీవుడే దేవుడు. జీవత్వమునకు, దైవత్వమునకు ఉన్న వ్యత్యాసము మనము గుర్తించాలి. దేహమునే ఆధారము చేసుకొని జీవించేవాడు జీవుడు. మనో ఆత్మలను ఆధారము చేసుకొని జీవించేవాడు దేవుడు. దీనినే చిన్న పదములతో చెప్పాలంటే ఊగేవాడు జీవుడు ఊరకుండేవాడు దేవుడు. ఎప్పుడు steady గా ఉంటాడు. steady గా ఉండాలి. అదే దైవత్వమునకు గుర్తు. నిరంతరము గడియారము పెండ్యులమువలె మనసు చలింపచేసేవాడు జీవుడు.

11079602

అస్థిరం జీవనం లోకే అస్థిరం యవ్వనంధనం
అస్థిరం దారాపుత్రాది సత్యం కీర్తి స్థిరం ద్వయం.

ఈ శరీరము బాల్య అవస్థలు ఈ సుఖములు, ఈ దుఃఖములు, ఈ నష్టములు, ఈ వయః ప్రమాణాములు ఇవన్నీ అస్థిరము. యవ్వనము కూడా అస్థిరమైనదే. ఇది పూర్వము లేదు. ముందుకు ఉండదు. మధ్యలో వచ్చి పోయే passing cloud లాంటిది. మధ్యలో వచ్చి మధ్యలోనే పోతుంది. ఇంక ధనము. ధనము ఎంతవరకు ఉంటుంది మనదగ్గర. ఎప్పుడు ధనము కాలిక్రింద నీరు వలె కదలిపోతుంది. నీదగ్గర నూరు రూపాయలు నోటుంది. ఇది నా నోటు అంటావు. నీ ముఖము చూచి నూరు రూపాయల నోటు నవ్వుతుందట. ఓరే పిచ్చివాడా ఎంతసేపు నేను నీదగ్గర ఉండగలను. బజారుకు పోయి రా. నేను నీనుండి వెడుతున్నాను. నేను నీదగ్గర స్థిరముగా నుండే దానను కాదు. ఇలాంటి ముఖములు ఎన్నో చూచాను నేను. కట్టకడపటికి నారూపమే శిథిలమై పోతున్నది. ఈ చేతులు మారటం చేత. నా రూపము కదలిపోతున్నాది. కరగి పోతున్నాది. రాయి వంటిదే కదలుతుంటె కరగిపోతున్నది. చక్కగా మీరు గుర్తించండి. చీమ ఎంత చిన్నది. చీమలంతా ఒకే వరుసగా ఒకరాయిపై ప్రయాణమై పోతే కొంత సేపటికి రాయి కరగిపోతుంది. దారి ఏర్పడుతుంది. మన కదలిక చేత రాయి కరగిపోతుంటె ఈ కాగితము కరెన్సీ ఎంతవరకు స్థిరముగా ఉంటుంది. భార్యా బిడ్డలు ఎంత వరకు స్థిరము. బిడ్డలు ఎప్పుడు వచ్చారు? నీవెంట వచ్చారా? లేదు. పుట్టక మునుపు నీకు కొడుకులు లేరు. మరణించిన తరువాత కొడుకులు లేరు. వివాహము కాక పూర్వము భార్యలేదు. మరణించిన తరువాత భార్యలేదు నీవు వివాహము జరిగిన తరువాత ఈమె నాభార్య అంటున్నావు. పుట్టిన తరువాత ఇతను నా కుమారుడు అని అంటున్నావు. ఇంతకు పూర్వము భార్య, కుమారుడు అని ఎవరిని భావించావు. ఎవరిని లేదు కానీ రెండు మాత్రము స్థిరముగా ఉంటున్నాయి. సత్యము, కీర్తి స్థిరముగా ఉంటున్నాయి. దేహము మరణించిన తరువాత కూడా కీర్తి నిలుస్తుంది. త్రికాలబాధ్యం సత్యం. మనము పుట్టక పూర్వము ఉంది సత్యము. మన జీవితములోను ఉంటున్నది. మనము మరణించిన తరువాత ఉంటున్నది. సత్యం మారేది కాదు.

దైవము సత్య స్వరూపము. Truth is God. అట్టి సత్యమును మనం సహాయంగా తీసుకోవాలి. సత్యం మన స్వరూపమే. మనం కొత్తగా కనుక్కున్నటువంటిది కాదు. అయితే ఏకాంతముగా మనం కూర్చున్నప్పుడు ఆ సత్యం మనకు సాక్షాత్కరిస్తుంది. అయితే ఏకాంతమంటే ఏమిటి? అనేకమంది ఏకాంతమును వికృతి మార్గములో తలంచి పెడర్థములుగా భావిస్తున్నారు. ఏకాంతముగా ఒక రూములో కూర్చుని తలుపులు కిటికీలు మూసుకొని ఒక్కడే ఉండేది

11079603

ఏకాంతమని భావిస్తున్నాము. అది కాదు ఏకాంతము. అందరి మధ్య ఉండు, బజార్లో ఉండు, ఎక్కడైనా ఉండు, సమావేశములో కూర్చో. ఎక్కడున్నా నీ మనస్సు దైవం వైపు మరల్చు. నీ దేహముగాని, భావము గాని ఏ మాత్రము చలించకూడదు. నీకు భగవంతునికి సంబంధము. ఈ రెండింటికి సంబంధమది నదే ఏకాంతము. మధ్యలో ఏదీ అడ్డు రాకూడదు. ఒక దోమ కూడా అడ్డు రాకూడదు. అది ఏకాంతము ఏకాంతమునకు అనేక అర్థములు చెబుతున్నారు. నీవేమైనా చేస్తుండు, ప్రయాణము చేస్తుండు బస్సులోపో రైలులోపో నీ మనస్సును దైవముపై ఉంచాలి. దానిని ఏకాంతమని చెబుతూ వచ్చారు. పరులలో ఏవిధమైన సంబంధము పెట్టుకోకుండా ధ్యాన సమయమందు, భగవచ్చింతన సమయమందు నీవు, భగవంతుడు రెండు తప్ప మరొకదానికి అవకాశము ఇవ్వకూడదు. ఈ రెండింటి యందు ఆవిర్భవించే ప్రకాశమే ప్రేమ. అడవిలో చెట్లుంటాయి. చెట్లకొమ్మలు ఒకదానిని ఒకటి రాసుకుంటాయి. ఒకదాని కొకటి రాసుకోటం చేత అగ్ని ప్రారంభమవుతుంది. అదే విధముగా జీవుడు దేవుడు అనే సంబంధములో ప్రేమ అనే జ్యోతి వెలుగుతూ వస్తుంది. భార్యా బిడ్డల నుంచి వచ్చే ప్రేమకు, తల్లిదండ్రుల దగ్గరనుంచి వచ్చే ప్రేమకు, అన్నదమ్ములనుంచి వచ్చే ప్రేమకు చాలా వ్యత్యాసము ఉంటున్నది. అవన్నీ క్షణికమైనవి. కదలిపోయేవి. స్థిరము కానివి. అవన్నీ పారిపోయేవి. జారిపోయేవి. కాని నీకు దైవమునకు మధ్యనున్న సంబంధము ఏమాత్రము చలించేది కాదు. ఇది భ్రమించేది కాదు. అట్టి నిత్య సత్యమైన ప్రేమ ఎవరు కలిగి ఉంటారో వారికే సర్వసౌకర్యములు కలుగుతుంటాయి. సమస్తము వారికి స్వాధీనమై ఉంటాయి. అందుకోసమే త్యాగరాజు చెప్పాడు 'రామా! నీ అనుగ్రహ బలము ఒకటి ఉంటే చాలు నవగ్రహములు నా హస్తగతమవుతాయి' అన్నాడు.

సూరదాసు దగ్గరకు ఒక cowboy మాదిరి కృష్ణుడు వచ్చాడు. 'అయ్యా సూరదాసు ఎక్కడికి వెడుతున్నావు'. 'నీవు ఎవరు నాయనా' అడిగాడు సూరదాసు. 'నేను cowboy'. ఈ cowboyకి రెండర్థాలుంటున్నాయి. పశువులను మేపేవాడని ఒకటి గోవులను కాపాడే వాడని మరొకటి. 'నీవు ఏ అర్థమైనా తీసుకో నేను cowboyని. ఎక్కడికి పోతున్నారు?' 'ద్వారకకు పోతున్నాను నాయనా'. 'అయితే దారి ఇది కాదు'. 'అయితే ఏది దారి'. 'నేను చూపిస్తానురా!' వెంటనేగా పిల్చి 'నేనెవరో నీకు తెలుసా?' 'నీవు cowboy' అన్నాడు. 'cowboy అని నీకు ఎట్లా తెలుసు?' 'నీవే చెప్పావు'. 'అయితే నేను ఎట్టి పశువుల కాపరినో తెలుసా? నేను గోపాలుడను. నీవు గోపాలుడుండే ప్రదేశమునకు వెళ్లాలని ప్రయత్నిస్తున్నావు. ద్వారకలో ఉంటున్నాడు గోపాలుడు. నీకు దృష్టి ఇచ్చేదా' అడిగాడు. 'వద్దన్నాడు' సూరదాసు.

11089604

కన్నులుండియు గ్రుడ్డులై కళ్యాణ కరమైన
నీ మూర్తి దర్శింప నేరరైరి
చెవులుండి చెవుడులై అతిమనోహరమైన
నీ గానంబు వినగ నేర్వరైరి
పాణి పంకజమందు పరమాత్ముడుండ
పాడు సంసారము కోరనేల

అయ్యో ఎంతమందికి కన్నులు లేవు కన్నులుండి ప్రయోజనము ఏమిటి? ఎంతమంది నిన్ను చూడ గలిగారు. ఎవరు చూడలేదు. నిన్ను చూసే కన్ను ఒకటి ఉంటే చాలు నాకు. నీ వేణు గానము ఎవరైనా విన్నారా? ఎవరు వినలేదు. నాకివన్నీ వద్దు. ఎందుకనగా సర్వము అందిచ్చే మేరు పర్వతము వలె నీవు వుండుండగా ప్రాకృత నాణెములు నాకెందుకు. ఓ గోపాలా నీవు కేవలము పశుల కాపరి కాదు. సాక్షాత్ గోపాలుడవే.' 'ఎట్లా తెలుసుకున్నావు?' 'నీ మధురమైన మాటలందే నీ స్వరూపము నాకు గోచరించటానికి వీలవుతుంది. భగవంతుడు ఎప్పుడు మధురమైన రీతిగా మాట్లాడుతూ ఉంటాడు. అందువలనే

నయనం మధురం - వచనం మధురం
హృదయం మధురం - హస్తం మధురం
పాదం మధురం - మధురాధిపతే మధురం మధురం.

అంతా మధురమే.

కనుకనే తులసీదాసు చెప్పాడు. హస్త కమలము, పాదకమలము, ముఖ కమలము, నేత్ర కమలము అని కమలములతో భగవంతునికి. ఎందుకోసం కమలములుగా పోల్చాడు. కమలము ఎక్కడ పుడుతున్నాయి? బురదలో పుడుతున్నాయి. నివసించేది యెక్కడ? నీటిలో నివసిస్తున్నాయి. పుట్టిన బురదను చేర్చుకోటంలేదు. తరువాత నిలుపుకున్న నీటిని చేర్చుకోటం లేదు. బురద లేకపోయినా నీరు లేకపోయినా క్షణం జీవించలేవు ఈ కమలములు.. నేను పూర్వ జన్మమనే బురదలో పుట్టాను. కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ పూర్వజన్మ అంతా బురద. వర్తమానమనే నీటిపై నిలిచాను. ఈ వర్తమానము లేకపోతే నేను నిలువలేను. past లేకపోయినా ఉండలేను. కాబట్టి రెండింటిలో ఉండి కూడా రెండింటిని చేర్చుకోటంలేదు. కారణం ఏమిటి? దానియందే ఉండి దానిని చేర్చుకోకుండా వుండటమే కమలమునకు సరైన అర్థము. కనుక నీవు present లో ఉన్నావు. దేనిపైన ప్రపంచమనే దానిపై వుంటున్నావు. ఈ ప్రపంచమును నీలో

చేర్చుకోవద్దు. ఈ point అంతా కూడా ప్రపంచమే. ఏమిటి ఈ ప్రపంచము? ప్ర అనగా వికాసము. పంచము అనగా పంచభూతములు. పంచభూతముల వికాసమే ప్రపంచము. శబ్ద, స్పర్శ, రూప రస గంధాదులు. నీవు ఎక్కడికైనా వెళ్ళు. ఈ పంచ భూతములుంటున్నాయి. Moon కి పోయినా ఈ పంచభూతములను నీవెంట తీసుకు వెళుతున్నావు. ఎందుకంటే ఎక్కడకు వెళ్ళినా యీ పంచభూతములు లేకపోతే నీ భూతం ఉండలేదు. ఈ పంచభూతములతో కూడినదే ప్రపంచము. ఈ ప్రపంచములోనుండి కూడను ఈ ప్రపంచముతో నాకు సంబంధము లేదు.

కంటి గ్రుడ్డుకు కాటుక అంటునట్లు. ఆడవారు కంటికి కాటుక పెట్టుకుంటారు కానీ అది గుడ్డుకు అంటదు. మనం నాలుకతో ఎన్నో పదార్థములు తింటున్నాము. మంచి ఆయిల్తోనున్న పదార్థములు తింటున్నాము కానీ నాలుకను జిడ్డు అంటదు. చూశారా. ఆ విధముగా జగత్తులోనే ఉండి కూడను జగత్తును నేనంటను. దుఃఖముగానీ లేక ఆనందముగాని, సంయోగ వియోగములతోగానీ నాకు సంబంధము లేదు. కేవలం శరీరముతో సంబంధము ఉందిగానీ ఆత్మ సంబంధం ఏ మాత్రము లేదు. ఆత్మ సంబంధమే ఎందరికి ఉంది. దేహ సంబంధముందిగాని మానసిక సంబంధము లేదు. ఆ మనసే దైవం వైపుకు మరల్చాలి. అదే ఏకాంతము. దైవత్వం లేనిచోటు లేదు. సర్వత్రా ఉంది. సర్వము దైవ స్వరూపమే. కనుక దైవత్వమును ప్రత్యేకంగా వెతకటానికి వీలుకాదు. సత్యము అనే స్వరూపముతో దైవము ప్రకాశిస్తున్నాడు. ఈ సత్యము ధర్మమును అనుసరిస్తోంది. ఈ సత్య ధర్మముల రెండింటి చేరిక చేత ప్రేమ ఆవిర్భవిస్తున్నది. అక్కడ హింస అనేది ఉండదు. సత్యముకోసం పాటు పడేవాడు హింసకు పాల్పడడు. ధర్మం ఆచరించేవాడు హింసకు పాల్పడడు. శాంతితో జీవించేవాడు హింసలో పాల్గొనడు. ప్రేమతో జీవించేవాడు హింసలో పాల్గొనడు. ప్రేమ చేరితే అక్కడ అహింస చేరిపోతుంది. సత్యం ఎక్కడ ఉంటే అక్కడ అహింస ఉంటుంది. ధర్మం ఎక్కడ ఉంటే అహింస అక్కడ ఉంటుంది. సత్య ధర్మ శాంతి ప్రేమలు ఎక్కడుంటాయో అక్కడ అహింస ఉంటుంది. కనుక మన హృదయములో సత్యధర్మ శాంతి ప్రేమలకు తగిన అవకాశం ఇవ్వాలి. సత్యం నాలుకపై నాట్యమాడాలి. ధర్మం చేతులతో ఆచరించాలి. ప్రేమ హృదయంతో అనుభవించాలి. తలతో శాంతిని మనం పొందాలి. ఇంక అక్కడ హింసకు అవకాశమే లేదు. సత్య ధర్మ శాంతి ప్రేమలు నాలుగు ఉన్నప్పుడు అక్కడ హింస అనేది ఉండదు. మన సంకల్పములో కూడా హింస రాదు. ఈనాడు లోకంలో ఎక్కడ చూచినా హింస కనిపిస్తుందంటే యీ నాలుగు లోపించటం వలనే. కనుక మొట్టమొదట ప్రేమను పెంచుకోండి. ప్రేమ ఒక్కటుంటే సర్వము మన స్వాధీనమై పోతుంది. ప్రేమతత్వాన్ని

11079606

మనం ఏనాడు వదల కూడదు. నా అన్ని ప్రసంగములలో కూడ ప్రేమ, ధర్మము ఈ రెండు లేకుండా నేను ఏ మాత్రం ప్రసంగించలేను. నాకు ప్రేమ, ధర్మము ఉచ్ఛ్వాస నిశ్వాసములు. subject ఏవిధమైనది వచ్చినా ఫరవాలేదు. అన్నింటిలో ప్రధానము ప్రేమ, ధర్మము. అదియే వేదము యొక్క ప్రధాన ప్రమాణము. ఇవి రెండు మానవునిలో నిరంతరము తాండవమాడుతూ ఉండాలి.

విద్యార్థులారా అనేక రకములైన గ్రంథములు మీరు చదువుతున్నారు. అనేక subjects మీరు తీసుకుంటున్నారు. ఎన్ని చదివినప్పటికిని, ఎన్ని తీసుకున్నప్పటికిని ఎన్ని విన్నప్పటికిని యిందులో ఎంతవరకు మనం సత్యప్రేమలలో అర్థం చేసుకుంటున్నాం. సేవలు చేయాలి. ఎలాంటి సేవలు? అహంకారం నాశనం చేసే సేవలు. ఆడంబరాన్ని అణగ ద్రొక్కే సేవలు చెయ్యాలి. అనేకమంది భక్తులు స్వామీ మాకు సద్బుద్ధి నివ్వండి, సదాచార మార్గములో ప్రవేశించే శక్తి యివ్వండి. ఈ విధంగా అడిగేవారు భక్తులే కాదు. ఎందుకనగా నాకు సరైన సద్బుద్ధిని యివ్వండి అంటున్నారు. సద్బుద్ధి ఉంది నీలో. ఇది ఒకరు యిచ్చేది పుచ్చుకునే బ్యాంకు వ్యాపారము కాదు. నీకు సద్బుద్ధి ఉంది. నీవు ఉపయోగ పెట్టటం లేదు. ఆకులో అన్నం అంతా వడ్డించారు. తింటే కదా నీ ఆకలి తీరుతుంది. ఆకులో నున్నది అలానే పెట్టేస్తే ఆకలి ఎలా తీరుతుంది? నీవు దానిని భుజించిన తరువాత కదా శక్తి లభిస్తుంది. నీవు భుజించటం లేదు. శక్తి లభించటం లేదు. అందువలనే నీవు బలహీనుడిగా భావిస్తున్నావు. చెప్పినవి మీరు ఆచరించండి. కానీ ఈనాటి ఆచరణ ఎలా ఉందంటే ఏదైనా ఉపన్యాసం, ఏదైనా హరికథ గానీ, ఏదైనా భాగవత కాలక్షేపం జరుగుతుంటే అందరు వెడుతుంటారు. ఆ ప్రసంగాలు జరిగేంత వరకు, ఆ హరికథలు జరిగేంత వరకు యీ మనిషిలో వైరాగ్యం ఆవిర్భవిస్తూ ఉంటుంది. ఆ వచ్చిన ఆవేశం, వైరాగ్యం ఎంత వరకు ఉంటుంది? ఉపన్యాసం ముగిసిన తక్షణమే ముగిసిపోతుంది. ఈ విన్న విషయాలు యింటికి పోయేంత వరకు కూడా లోపల నిలవవు. ఇలాంటి వారు ఎన్ని ఉపన్యాసాలు విని ఏమి లాభం? కేవలం వినటమే గానీ ఆచరించటం లేదు. ఆచరించినప్పుడే ఫలితము వస్తుంది. తిన్నప్పుడే రుచి తెలుస్తుంది. ఆకలి తీరుతుంది. దాని ఫలము మనకు చేరుతుంది. మనకు రుచి తెలియటం లేదు. ఎందువల్ల మనం తినటం లేదు. ఎందువల్ల మన బలహీనత పోవటం లేదు. వింటున్నది భుజించాలి. తిన్నటువంటిది జీర్ణించుకోవాలి. ఇది కేవలం కలిప్రభావములా ఉంది. ఇది ఒక రకమైన ఆధ్యాత్మిక ఫ్యాషనులా ఉంటున్నది. ఫ్యాషను కాదు కంపేషన్ మనం పెంచుకున్నప్పుడే యీ ఫ్యాషన్ పరుగెత్తి పోతుంది. ఈనాడు వినటమే ఫ్యాషను గా ఉంది. ఎక్కడికి వెళ్ళారండి. ఫలాని ప్రసంగానికి వెళ్ళాను. ఏమి జరిగింది అక్కడ అని అడిగితే

లిబ్బో ఎంతో జరిగింది అంటారు. అందులో కొంచెమైనా చెప్పండి అంటే తలలో చేరలేదంటాడు. ఎందుకు పోయినట్లు.

ఒక భక్తుడు ఉండేవాడు. అతడు పదహారు సంవత్సరముల నుండి ప్రసంగములకు వెడుతున్నాడు. ఏమిటి ఆ ప్రసంగము? రాముని చరిత్ర. సప్తాహములు జరుగుతున్నాయి. అందులో ఎక్కువ వైరాగ్యం జనిస్తూ వచ్చింది. జీవితమంతా కష్టముల పాలైంది. ఈ విధంగా పండితుడు మరీ విపరీతంగా చెప్తూ వచ్చాడు. ప్రసంగమునకు వచ్చేవారు నిత్యము రావాలని ఒక శాసనము చేశాడు. ఈ ప్రసంగిం చేవాడు. ఎందుకనగా రాకపోతే గుంపు తగ్గిపోతుంది. ఈ పండితునికి జనం చాలామంది వస్తున్నారనే గౌరవం రావాలి. అందువల్ల ఏ వరు మాన కూడదు. అప్పుడే ఈ ప్రసంగ ఫలితము మీకు లభిస్తుంది అన్నాడు. ఒకనాడు యీ భక్తుడు ఎక్కడికో తప్పని సరిగా పోవలసి వచ్చింది. నాబదులు నా కుమారుని పంపించనా అని అడిగాడు శాస్త్రిగారిని. సరే seat fillup కావాలని సరే కుమారుని పంపమన్నాడు. ఇంటికి పోయాడు. యోచించాడు. ఈ పండితుడు వైరాగ్యం ఎక్కువగా చెబుతున్నాడు నా కుమారుడు యిది వింటే విరాగియై అన్నీ వదిలి పెట్టి పోతాడని భయపడ్డాడు. ఇలా అనుకొని ఉదయం పండితుని దగ్గరకు వెళ్లాడు. ఏమండి మీ ప్రసంగములు చాలా బావుంటున్నాయి. ఈ నాటి చిన్న పిల్లలు ఈ వైరాగ్యముతో ఇల్లు వాకిలి వదిలి వెడితే నా గతి ఏమిటి అన్నాడు. ఆ పండితుడు హృదయానికి నాటుకొనేటట్లుగా చెప్పాడు. అయ్యా! మీరు పదహారు సంవత్సరముల నుండి నా ప్రసంగములు వింటున్నారు. మీకెంత వైరాగ్యం వచ్చింది? ఒక్క దినము మీ కుమారుడు వస్తే వానికి వైరాగ్యం వస్తుందా! వైరాగ్యం అంత సులభంగా వచ్చేది కాదు! అలాగే ఈనాడు సంవత్సరముల కొలది వస్తున్నారు ఉపన్యాసాలకు. కొంచెమైనా వైరాగ్యాన్ని గాని, పరభక్తి గాని ప్రజలలో నాటుకోటం లేదు. వినేంత వరకు హాయిగా ఉంటుంది. ఆనందముగా ఉంటుంది. ఈ ఆవరణ దాటి బయటికి వెళ్ళగానే తిరిగి యథాస్థానం. యథాస్థితి. యథా భావం. ఎంత కాలం విని ఏమి ప్రయోజనం.

నేను నిత్యము మొత్తుకుంటూనే ఉన్నాను. నా శ్రమ వేరుగాని మీకు శ్రమగా ఉంటున్నది. ఒక్క పదమైనా హృదయంలో చేర్చుకుంటున్నారా? ఇంకా మాకది కావాలి, ఇది కావాలి అంటారు. ఎలా చేసేది. ఎలా మీరు మోక్షమనే దానిని ఆశిస్తున్నారు. అడగటానికైనా సిగ్గులేదా? అడిగేటందుకు అవమానము లేదా? ఎంతవరకు మీరు పాటిస్తున్నారు? దానిని మొట్టమొదట మీరు గుర్తించాలి. సంవత్సరముల కొలది వింటున్నారు. మన వ్యాపారము తగ్గలేదు. దినదినమునకు పెరిగి పోతున్నాయి. స్వామి అది చేయండి ఇది చేయండి. అడక్కుండా నడుచుకోండి.

నేనే చేస్తాను ఆపని. చెప్పినట్టు నడుచుకోండి. నడుచుకోటానికి జీరో. అడగటానికి హీరో. ఈనాటి భక్తులు ఎలా ఉన్నారంటే పనికి పరార్ తిండికి తయార్. చెప్పిన ఆజ్ఞలు ఏమాత్రం పాటించటం లేదు మొట్టమొదట ఆజ్ఞను శిరసావహించి ఆచరణలో పెట్టి ఏ ఒకటి రెండైనా మనం అనుభవించటానికి ప్రయత్నించాలి. ఆచరణ ముఖ్యముగాని. రామాయణము, భాగవతము, ఖురాన్, బైబిల్ పుస్తకములు పారాయణము కోసము వ్రాసినవి కాదు. ఆచరణ కోసమని పెట్టారు. కాని ఈనాడు ఆచరణ లేదు. పారాయణ చేస్తున్నాము. ఎన్నో సంవత్సరములనుంచి రామాయణము పారాయణ చేస్తున్నారు. భగవద్గీత పారాయణ చేస్తున్నారు. విష్ణు సహస్రనామం పారాయణ చేస్తున్నారు. ఏమి ప్రయోజనము. పారాయణాలు పరుగెత్తి పోతున్నాయి. ఎందుకోసం పారాయణము చేయటం. ఒక్కటైనా ఆచరణలో పెట్టండి. అదే చాలు. ఎందుకనగా గంగిగోవు పాలు గరిటెడైన చాలు కడివెడైన నేమి ఖరము పాలు.

మీరు ఆచరణలో పెట్టండి. అధిక భాష లేకుండా చూచుకోండి. ప్రశాంతముగా జీవితము గడపండి. ఒకరికొకరు అధికంగా స్నేహం పెట్టుకో కూడదు. ప్రేమను వదలకండి. ఏదైనా సహాయము కావలిస్తే సహాయము చేయాలి. help ever hurt never. ఒక్కటైనా మీరు ఆచరణలో పెడితే చాలు. అంతేకాక పలికే మాటలు మధురముగా ఉండాలి. ఈ విధంగా ఉన్నప్పుడే మనం విన్నందుకు, పుస్తకాలు చదివినందుకు, ఆశ్రమములో జీవించినందుకు అంతో ఇంతో ఫలిత ముంటుంది. జీవించటము ఆశ్రమములో. ఉన్నవాళ్లకు తమకు యిద్దరికి శ్రమతో కల్పిస్తున్నారు. ఎందుకు ఆశ్రమములో ఉండాలి. శ్రమను పోగొట్టుకొనుటకు ఆశ్రమము కోరాలి. ఇన్ని attachments వస్తున్నాయి యిక్కడ కూర్చుంటే. ఆశ్రమ మనకు చెందినది కాదు. శ్రమ లేకుండా ఉంటుండాలి. శ్రమ లేకుండా జీవించాలి. నిత్యము చెప్పే విషయాల్లో ఎన్నో మనము విన్నవే ఉంటాయి. విన్నవి వచ్చినప్పటికి తిరిగి మననం చేసుకొని ఆచరణలో పెట్టాలి.